

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 11 పుష్పం : 14 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)


## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 30-11-98 కాపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కురుక్షేత్రయుద్ధంలో వేదాలయొక్క సారాన్ని, ఉపనిషత్‌ల యొక్క సారాన్ని కృష్ణుడు అర్జునుడికి భగవద్గీత రూపంలో బోధించాడు. యుద్ధభూమిలో అర్జునుడు తన బాధను అంతా చెప్పాడు. కృష్ణుడు అతను చెప్పినది అంతా విని అర్జునుడి బాధను అర్థంచేసుకొని అతని స్వభావాన్ని అర్థంచేసుకొని రెండవ అధ్యాయం నుండి భగవంతుడు తన బోధను ప్రారంభించాడు. భగవద్గీత ఉపదేశగ్రంథము. అర్జునుడిని అడ్డుగా పెట్టుకొని మన అందరికి భగవంతుడు ఉపదేశం చేసాడు. ఇది కొత్తగా కృష్ణుడు చెప్పలేదు వేదాల సారాన్ని, ఉపనిషత్‌ల సారాన్ని మన అందరికీ అర్థమయ్యేలాగ ఆచరణ దృష్టిలో పెట్టుకొని అన్నీ వివరంగా చెప్పాడు. మొత్తం 18 అధ్యాయాలు చెప్పాడు. ద్వితీయం అద్వితీయం అని చెపుతారు. భగవంతుడు తను చెప్పవలసినది అంతా రెండవ అధ్యాయంలో చెప్పి మిగతా 16 అధ్యాయాలలో దానికి వివరణ ఇచ్చాడు. భగవద్గీతలో మీకు బాగా నచ్చిన శ్లోకం చెప్పండి అని రమణమహర్షిగారిని అడిగితే అన్నీ ఇష్టమే అని చెప్పారు. అంతా మేము చదవలేము ఏదో ఒక శ్లోకం చెప్పండి దానిని పట్టుకొంటాము అని అడిగితే అప్పడు భగవాన్ ఈశ్లోకం చెప్పారు.

> అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః
> అహమాదిశ్చ మధ్యం చ భూతానామన్త ఏవచ

నేను అందరి హృదయాలలో చైతన్యంగా, ఆత్మగా ఉన్నాను. నేను ఏ జీవుడిని విడిచిపెట్టిలేను. నేను అందరి హృదయాలలో సమానంగా ఉన్నాను. ఈ జీవకోటికి ఆది నేను, మధ్య నేను, అంతం నేను. ఈ జీవకోటి అంతా నాలోనుండే వస్తున్నారు, నాలోనే పెరుగుతున్నారు, మరల నాలోనే లయమవుతున్నారు. ఈ జీవకోటికి అంతానేనే ఆధారము అని భగవంతుడు చెపుతున్నాడు. ఈశ్లోకం అర్థమవ్వటం కష్టం. రూపబుద్ధి ఉన్నవారికి, నామబుద్ధి ఉన్నవారికి ఇది అర్థంకాదు. భగవంతుడు హృదయంలో ఉన్నాడు. నామం లేకుండా ఉన్నాడు, రూపంలేకుండా ఉన్నాడు. పనిలేకుండా ఉన్నాడా అంటే పని చేస్తున్నాడు. ఈదేహం భూమి మీదకు ఎందుకు వచ్చిందో ఆదేహం యొక్క ప్రారబ్ధము ననుసరించి దేహాన్ని ఆడిస్తున్నాడు. డైరెక్టుగా హృదయంలో ఉన్న వస్తువును ఉపాసన చేయటం కష్టం. అందువలన ఏదో ఒక అవతారపురుషునిగాని, గురువునుగాని తీసుకొని ఉపాసన చేసుకోమని చెప్పటం కోసం గీతలో భగవంతుడు కృష్ణుడిని నేను, రాముడిని నేను, కుమారస్వామిని నేను,

శంకరుడిని నేను అని చెప్పకొంటూ వచ్చాడు. అంటే మనం ఉపాసన చేసుకోవటం కోసం ఇవి అన్ని చెప్పాడు. ఉపాసన లేకపోతే మోక్షం రాదు. భగవద్గీత చదివితే మనకు తెలియని విషయం ఉండదు. భగవద్గీత చదవకపోతే కృష్ణుడు గురించి మీకు తెలియదు. మీకు ఏదైనావిషయంలో దుఃఖం వస్తూ ఉంటే గీత శ్రద్ధగా చదివితే మీదుఃఖాన్ని తీసివేసే శ్లోకాలు అనేకం గీతలో ఉన్నాయి. మనం బాగుపడటానికి గీతలో ఉన్న ఒక్క శ్లోకం చాలు. నీ మనస్సులో ఉన్న దోషాలు అన్నీ ఒక జన్మలో పోవు. నీ దోషాలు తెలుసుకొని వాటిని తొలగించుకోవటానికి సాధన చేయాలి. వాటిని పోగొట్టుకోవటానికి బహుజన్మలు కృషి చేయాలి. బహుజన్మల కృషివలనగాని నీకు ఆత్మజ్ఞానం కలుగదు అని గీతలో భగవంతుడు చెప్పాడు.

కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మఫలహేతుర్భూర్మాతే సఙ్గోస్త్వకర్మణి

ఈశ్లోకం మీద కర్మయోగం అంతా ఆధారపడిఉంది. ఈశ్లోకం మీరు అర్థం చేసుకొని, ఆచరించి, అనుభవంలోనికి తెచ్చుకొంటే ఈజన్మలోనే మీకు మోక్షం వస్తుంది అని లోకమాన్య తిలక్ చెప్పారు. ఈశ్లోకంలో భగవంతుడు నాలుగు విషయాలు చెప్పాడు. మొదటిది కర్మ చేయటానికే నీకు అధికారం ఉంది. రెండవది కర్మఫలితాన్ని నీవు ఆశించవద్దు. మూడవది ఈ పనిచేయటం వలన నాకు ఈ ఫలితం వచ్చింది అని కర్మఫలానికి హేతువుకావద్దు. నాల్గవది భగవంతుడు కర్మఫలితాన్ని ఆశించవద్దు అని చెపుతున్నాడు కదా అని మొత్తం కర్మ చేయటం మానివేయవద్దు అని చెపుతున్నాడు. అర్జునా అకర్మపట్ల ఆసక్తి పెట్టుకోవద్దు అని చెప్పాడు. అకర్మపట్ల ఆసక్తి పెట్టుకొంటే నీకు దేహయాత్రకూడా కష్టమవుతుంది. దేహపోషణకు ఇతరులమీద ఆధారపడితే బానిసత్వబుద్ధి వస్తుంది. నీవు పని చెయ్యి. పనియందు విరక్తి పెట్టుకోవద్దు. పని వలన వచ్చే ఫలితానికి కారణం అవ్వవద్దు. కర్మఫలాన్ని ఆశించవద్దు. కర్మని విడిచిపెట్టవద్దు. మనందరిని ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలకు తీసుకొని వెళ్లాలని భగవంతుని సంకల్పం. భగవద్గీత మనలను గైడ్ చేస్తుంది. దైనందిన జీవితంలో మనం ఎలా ఉండాలి, ఏ సంఘటన వచ్చినప్పడు ఎలా ప్రవర్తించాలి అని మనలను గైడ్ చేస్తుంది. మనిషి జన్మవచ్చాక శుభం వస్తుంది, అశుభం వస్తుంది, శుభం వచ్చినప్పడు పొంగిపోతున్నారు అనుకోండి, అశుభం వచ్చినప్పడు కృంగిపోతున్నారు అనుకోండి ఆధ్యాత్మిక జీవితానికి మీరు పనికిరారు. సర్వకాల సర్వావస్థలలో ఎవడైతే తన బుద్ధిని సమానంగా ఉంచుకొంటున్నాడో, ప్రకృతి గుణాలకు ఎవడైతే అతీతంగా ఉంటున్నాడో వాడు ఆధ్యాత్మిక జీవితానికి పనికివస్తాడు. భగవంతుడు ఏమాటచెప్పినా, ఏశ్లోకం చెప్పినా, జీవకోటికి ఏ సందేశం ఇచ్చినా వాటి గమ్యం మోక్షానికి తీసుకొని వెళ్లటమే.

నాలుగు వేదాలలో అపారమైన జ్ఞానసంపద ఉంది. అది అంతా మనకోసం సమీక్షించి గీతలో భగవంతుడు చెప్పాడు. భక్తిమార్గం, ధ్యానమార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం ఇలా అనేక మార్గములు చెప్పాడు. ఏమార్గంలో ప్రయాణం చేసినా మోక్షం పొందవచ్చు. అన్నిమార్గములు

సమన్వయం చేసుకొని ప్రయాణంచేసినా మోక్షం పొందవచ్చు. మనం ఏది చేసినా నేను ఉంటుంది. మనకు ఏ నేను అయితే ఇష్టమో ఆ నేనును ఊడగొట్టటానికి రమణమహర్షిగారు చూస్తారు. ఆయన ఏది చెప్పినా ఆ నేను గొడవే. నీవు ఏ మార్గంలో ప్రయాణించినా దేహగతమైన నేనును ఊడగొట్టుకో యోగం యొక్క లక్ష్యం ఇదే అంటారు భగవాన్. నీహృదయంలో సత్యవస్తువు ఉంది, మోక్షం ఉంది, నిర్వాణస్థితి ఉంది. అది నీకు తెలియకుండా ఏదైతే అడ్డువస్తోందో దానిని ఊడగొట్టుకో ఇది రమణమహర్షిగారి సిద్ధాంతం. నీకు ఏది అడ్డువస్తోంది దేహగతమైన నేను అడ్డువస్తోంది. నీకు ఏమార్గం ఇష్టమైతే అందులో ప్రయాణం చెయ్యి ఆనేనును వదిలించుకో. ఈ మిధ్యా నేనును తొలగించుకొంటే ఉన్నవస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. అప్పుడు మహాచీకటిలో నుండి బయటకు వచ్చేస్తావు. ఈలోకాన్ని చూసి ఏమీ పొంగిపోవద్దు. నీకు స్వప్నాలు వస్తాయి, స్వప్నంలో కూడా తలంపులు ఉంటాయి. మంచితలంపులు రావచ్చు, చెడుతలంపులు రావచ్చు. తలంపు లేకుండా నీకు స్వప్నంరాదు. స్వప్నంలో వచ్చిన తలంపులు ఎంత నిజమో ఈ జాగ్రదావస్థలో వచ్చే తలంపులుకూడా అంతే నిజం. ఇక్కడ ఏదో పెద్ద బండారం ఉంది అనుకోవద్దు. నీ హృదయంలో ఉన్న ఆనందం నీకు తెలిస్తే ఇక్కడ ఏమీలేదు అని నీకు తెలుస్తుంది. అబద్ధమైన నేను దేహంతో తాదాప్యం పొంది ఉంటుంది. దేహం పుట్టినప్పుడు నేను పుట్టాను అంటుంది, దేహం చనిపోతూ ఉంటే నేను చనిపోతున్నాను అంటుంది, దేహం పదవిలో ఉంటే నేను పదవిలో ఉన్నాను అంటుంది, ఆపదవి ఊడిపోతే నాపదవి పోయింది అంటుంది ఇలా ఎందుకు అంటోంది అంటే అది దేహంతో కలిసిపోయి ఉంటుంది. దేహం యొక్క రంగుతోటి, దేహం యొక్క గుణంతోటి కలిసిపోయి దేహం ఎటులాగితే అటు గంతులు వేస్తూ ఉంటుంది. దేహప్రారబ్ధమునుబట్టి ధనం వచ్చింది అనుకోండి నేను ధనవంతుడిని అంటుంది, ప్రారబ్ధమునుబట్టి ధనం పోయింది అనుకోండి నేను దరిద్రుడను అయిపోయాను అంటుంది. అలా అనుకొనేది, ఇలా అనుకొనేది కూడా మిధ్యానేనే. ఇవి అన్నీ తలంపులే. అసలు దేహమే ఒక తలంపు. చివర శ్వాసపోయే వరకు ఇలా దేహంతో తాదాప్యం పొందుతూ మిధ్యానేను బ్రతుకుతూ ఉంటుంది. ఏదోమార్గంలో ప్రయాణించి ఈమిధ్యానేనును, దేహగతమైన నేనును ఊడగొట్టుకొంటేనేగాని నీకు శాశ్వతమైన శాంతి, నిర్వాణసుఖం దొరకదు అన్నారు రమణస్వామి. దేహాలు చనిపోయిన తరువాత ఎవరిదారిని వారు వెళ్ళిపోతారు. కాని మనం కాపాడుకోవలసినది ఏమిటి అంటే భగవంతుని మీద విశ్వాసం చలించకుండా చూసుకోవాలి. ఈ బంధుత్వాలు, స్నేహాలు ఎంతకాలం ఉంటాయి. మనం ప్రాణాన్ని ఎలా కాపాడుకొంటున్నామో అలాగ భగవంతుని పట్ల విశ్వాసాన్ని కాపాడుకోవాలి. భగవంతునిపట్ల విశ్వాసం ఉంటే అది మనలను రక్షిస్తుంది, రక్షించటమేకాదు అది ఆత్మజ్ఞానాన్ని సముపార్జించి పెడుతుంది. మనం బాగుపడినా, చెడిపోయినా మన మనస్సేకారణం. అందువలన నీవు ఏమి చేస్తావు అంటే నీమనస్సును అదుపులో పెట్టుకో, ఇంద్రియాలను జాగ్రత్తగా నియమించుకో. నీవివేకం వలన, బుద్ధి

సూక్ష్మతవలన నీమనస్సును, ఇంద్రియాలను నియమించుకొంటున్నావు అనుకో నీవు పెద్దవాడివి అయిపోతావు, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వచ్చేస్తావు, చివరకు నాస్వరూపము కూడా పొందుతావు అని భగవంతుడు చెపుతున్నాడు.

కర్మచెయ్యి. ఫలితాన్ని ఆశించవద్దు. కర్మఫలితాన్ని ఆశించకుండా ఉంటే ఫలితం వస్తుంది. మోక్షం కూడా వస్తుంది. భగవద్గీత మోక్షానికి తీసుకొని వెళ్ళటానికి గైడ్‌బుక్. అటునుండి ఇటు చెప్పినా, ఇటు నుండి అటు చెప్పినా, ఏది ఏవిధంగా చెప్పినా, తలుపు సందున పెట్టి నీశరీరాన్ని నొక్కినట్లు భగవంతుడు నీమనస్సును నొక్కినా ఆయన ఉద్దేశం ఏమిటి అంటే నిన్ను మోక్షం దగ్గరకు తీసుకొని వెళ్ళటం, ఆయన స్వరూపాన్ని నీచేత పొందింపచేయటమే. అంతకంటే వేరే ప్రయోజనం ఏమీలేదు. మనలో పవిత్రత లేకపోతే భగవంతుడు చెప్పిన మాటలు వినాలని కూడా మనకు ఉండదు. ఇంజనీరింగ్, మెడిసిన్ చదవాలంటే 4,5 సం॥లు కష్టపడి చదువుతాము. ఈ విద్యలన్నీ నీపొట్టకే పరిమితం. నీదేహం ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. మోక్షం అంటే అభౌతిక స్థితి, అలౌకికస్థితి. జపం చేయకుండా, ధ్యానం చేయకుండా, ఏమీ కష్టపడకుండా ఏమీ సాధన లేకుండా ఆస్థితిని ఏదో అడ్డదారుల ద్వారా పొందుదాము అని చూస్తున్నాము. అడ్డదారుల ద్వారా జ్ఞానం రాదు. మనం చేయవలసిన కృషి చేయాలి. మనందరము బ్రతుకుతున్నాము. అయితే మన మనస్సును కేంద్రంగా పెట్టుకొని బ్రతుకుతున్నాము. మనమనస్సు ఎలా గంతులు వేయమంటే అలా గంతులు వేస్తూ ఉంటే మనస్సు ఆరోజుకారోజు పెరిగిపోతుంది. అలాకాకుండా భగవంతుని కేంద్రంగా పెట్టుకొని జీవిస్తూ ఉంటే నీకు తెలియకుండా మనస్సు నశిస్తుంది. మనస్సు చెప్పినట్లు వినకుండా భగవంతుడు చెప్పినట్లు జీవిస్తూఉంటే అది మనస్సుకు ఎదురీత అవుతుంది. మనస్సుకు ఎదురీత ప్రారంభిస్తే మీరు మనో మూలంలోనికి వెళతారు, మనో మూలంలోనే భగవంతుడు ఉన్నాడు. కృష్ణుడు గీతలో ఏమని చెప్పాడు అంటే మీకు తోచినట్లు చేయటం కర్మకాదు అది ఖర్మ అవుతుంది. భగవంతుడి మాటలను ప్రమాణంగా పెట్టుకొని పనిచేస్తే అది కర్మ అవుతుంది. మీకు ఇష్టమైనట్లు చేస్తే అది ఖర్మ అవుతుంది. కర్మవేరు, ఖర్మ వేరు అని భగవంతుడు చెపుతున్నాడు. మీరు ఏరకంగా పనిచేస్తే మీకు శాంతి కలుగుతుందో, మోక్షం కలుగుతుందో ఆరకంగా పనిచేస్తే అది కర్మ. కొంత స్వార్థం తగ్గించుకొని పనిచేసినా మీకు భక్తి కలుగుతుంది. భక్తివలన జ్ఞానం కలుగుతుంది. జ్ఞానం వలన భగవంతుని స్వరూపమును పొందుతాము.

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL